క్లుప్తంగా

రాయితీపై జీలుగ విత్తనాలు

రేగొండ (కొత్తపల్లిగోరి) : ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న జీలుగ విత్తనాలు ఆగ్రోస్ సేవాకేంద్రంలో అందుబాటులో ఉన్నాయని కొత్తపల్లిగోరి మండల వ్యవసాయాధికారి సారయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల జీలుగ బస్తాకు రాయితీపై రూ.2,137 చెల్లించాలన్నారు. 30 కిలోలు రెండున్నర ఎకరాలకు సరిపోతుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను తొలకరి వర్షాలకు చల్లి, 45 రోజుల తర్వాత పూత దశలో భూమిలో కలియదున్నాలన్నారు. దీంతో నేల సారవంతంగా మారి పంట దిగుబడి పెరుగుతుందన్నారు.

మాజీ ఎంపీటీసీని శిక్షించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న నిషిధర్‌రెడ్డి

గణపురం: ఐకేపీ కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్న మహిళలపై దాడిచేసి గాయపరిచిన బుర్రకాయలగూడెం మాజీ ఎంపీటీసీ కాల్వా సాగర్, అతని కుటుంబ సభ్యులను కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఊర నవీన్‌రావు డిమాండ్ చేశారు. బుర్రకాయలగూడెం గ్రామంలోని కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్న మహిళలను మంగళవారం వారు పరామర్శించి దాడి విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. గుండాగిరి చేస్తున్న సాగర్‌పై రౌడీ షీట్ ఓపెన్ చేయాలన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మంద మహేష్, మండల నాయకులు సోమ దామోదర్, మాదాసు మొగిలి, ప్రవీణ్, పెండ్యాల రాజు, సయ్యద్ గాలిఫ్, శంకర్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



చిట్యాల : మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన అచ్చె భాస్కర్ తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోంచి ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తీసుకెళ్లాడని ఎనిమిది నెలల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి మంగళవారం ఏఎస్సై సమ్మిరెడ్డి అందజేశారు. పోలీసులు సురేందర్, లాల్‌సింగ్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి



భూపాలపల్లి అర్బన్ : సైబర్ నేరాలపై ఉపాధ్యాయులు సైతం అవగాహన కల్పించాలని స్థానిక ఎస్సై సాంబమూర్తి కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో సాంబమూర్తి ఉపాధ్యాయులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి సైబర్ క్రైంపై అవగాహన కల్పించాలని, గ్రామీణ ప్రాంతాల్లోని వారి కుటుంబ సభ్యులు నేరాల బారిన పడకుండా ఉంటారన్నారు.

సీపీఎం నిరసన ర్యాలీ



ర్యాలీగా వెళ్తున్న నాయకులు, కార్మికులు

భూపాలపల్లి రూరల్: సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీ సీపీఎం కార్యాలయం నుంచి గణేష్ చౌక్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు మాట్లాడుతూ నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలన్నారు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని చెప్పారు. జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరి రమేష్, భూపాలపల్లి పట్టణ పేదల సంఘం కార్యదర్శి వెలిశెట్టి రాజయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వంగాల విజయలక్ష్మి, రవికుమార్, మహేందర్, తిరుపతి పాల్గొన్నారు.

కుట్టు మిషన్లతో రాజకీయం



టేకుమట్ల మహిళా సంఘం భవనంలో వృథాగా పడిఉన్న కుట్టు మిషన్లు



వెలిశాల ఉన్నత పాఠశాలలో నిల్వచేసిన కుట్టు మిషన్లు

- కలెక్టర్ మంజూరు.. ప్రజాప్రతినిధుల పెత్తనం
- రెండేళ్లుగా పంపిణీ చేయని వైనం
- కుట్టు మిషన్ల కోసం మహిళల ఎదురుచూపులు

టేకుమట్ల : మహిళా సాధికారతే లక్ష్యంగా వారు ఆర్థిక సుస్థిరత సాధించేందుకు రెండేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ భవేష్‌మిశ్రా మండలంలోని 24 గ్రామాల్లోని మహిళా సంఘ సభ్యుల కోసం రూ.20లక్షల నిధులను కేటాయించి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఒక్కో గ్రామంలోని మహిళా సంఘం సభ్యుల్లో ఆసక్తి గల 10 మంది మహిళలకు శిక్షణనందించి కుట్టు మిషన్‌ను అందించాలనేది కలెక్టర్ లక్ష్యం. దీంతో మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటు, కుటుంబానికి ఆసరాగా ఉంటారు. అందుకు అనుగుణంగా మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతీ గ్రామం సీఏల ఆధ్వర్యంలో 10 మందిని మహిళా సంఘ సభ్యులను ఎంపిక చేశారు. అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి టేకుమట్ల, వెలిశాలలో ఒకరిద్దరికి పంపిణీ చేసి మళ్లీ కుట్టు మిషన్లను తిరిగి తీసుకుని పలు చోట్ల వాటిని నిలవ్వచేశారు. అంతలోనే లోక్‌సభ ఎన్నికల సమయం సమీపించడంతో మండల సమాఖ్య ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ లబ్ధిదారుల జాబితాను మార్చాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు పట్టుబట్టడంతో పంపిణీని పూర్తిగా నిలిపి వేశారు. అనంతరం ఎన్నికలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కుట్టు మిషన్ల పంపిణీని కాంగ్రెస్ నాయకులు తెరపై తీసుకు వచ్చారు. దీంతో మొదటి రెండు జాబితాల్లో రూపొందించిన లబ్ధిదారుల ఎంపిక మరోసారి మారనుందని మహిళా సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ నిధులపై ప్రజా ప్రతినిధుల పెత్తనం..

మహిళల ఆర్థిక సుస్థిరతకు కలెక్టర్ ప్రత్యేక చొరవతో మహిళా సంఘ సభ్యులకు కేటాయించిన కుట్టు మిషన్ల పంపిణీపై ప్రజా ప్రతినిధుల పెత్తనంపై మహిళా సంఘ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు అందించే కుట్టు మిషన్లను నిల్వ చేసి ఏడాది పైగా గడిచినప్పటికీ కుట్టు మిషన్లపై రాజకీయ రంగు పులమడం సరైంది కాదంటున్నారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన జాబితానే సరైందని, మొదటి జాబితా ప్రకారమే కుట్టు మిషన్లను అందించాలంటున్నారు. కాదని అధికార పార్టీ నాయకులకు చెందిన వారికి కేటా యిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మండలంలోని పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పార్టీలకతీతంగా మహిళా సంఘాల సభ్యులకు కలెక్టర్ పంపిణీ చేసిన కుట్టు మిషన్లను వెంటనే అందించాలని కోరుతున్నారు.

జాబితాలో పేరుంది..



మహిళా సంఘాల సభ్యులకు కుట్టు మిషన్లను అందించేందుకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన జాబితాలో నా పేరుంది. కుట్టు మిషన్ కోసం ఏడాదిపైగా ఎదురు చూస్తున్నాం. కలెక్టర్ పంపిణీ చేసిన మిషన్లను ఇప్పటి వరకు ఇవ్వడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మండల సమాఖ్య సీఏలు రూపొందించిన జాబితాలోని లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేయాలి.

– గడ్డం సుమ, సంఘం సభ్యురాలు, టేకుమట్ల

రెండేళ్లుగా ఎదురు చూస్తున్నా..



గత ఎన్నికలకు ముందు మహిళల కోసం అప్పటి కలెక్టర్ పంపిణీ చేసిన కుట్టు మిషన్ల కోసం రెండు సంవత్సరాలకు పైగా ఎదురు చూస్తున్నాం. అప్పుడు పంపిణీ చేసిన, మళ్లీ మధ్యలో ఆగిపోయింది. వ్యవసాయ పనుల్లో ఇబ్బందిగా ఉంది. కుట్టు మిషన్ ఉంటే కొంచెం ఆసరాగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మహిళల కోసం వచ్చిన కుట్టు మిషన్లను వెంటనే పంపిణీ చేయాలి.

– దాసారపు సుమలత, సంఘం సభ్యురాలు, గర్మిళ్లపల్లి

అంజన్న ఆశీస్సులు అందరిపై ఉండాలి

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రేగొండ: ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ : అభయాంజనేయ స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని గూడెపల్లిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం, నవగ్రహాలు, జంటనాగులు, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. గూడెపల్లి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, నాయకులు నాయిని సంపత్‌రావు, ఎర్రబెల్లి రవీందర్ రావు, మాజీ సర్పంచ్ లింగంపల్లి ప్రసాద్‌రావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



చిట్యాల: శోభాయాత్ర నిర్వహిస్తున్న మాలధారులు

చిట్యాల : మండల కేంద్రంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నుంచి చింతలపల్లి, రాంనగర్, చిట్యాల మీదుగా హనుమాన్ మాలధారణ భక్తులు మంగళవారం హనుమాన్ స్వామి చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు వేణుసింగ్, ఆకుల రాజు, హరీష్, మొగిలి, రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

● డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

కాటారం : సరస్వతి పుష్కరాల్లో విధులు నిర్వర్తిస్తూ వడదెబ్బకు గురై మృతి చెందిన మండలంలోని గంగారం గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు మంతెన శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం రూ.35 కోట్లతో నిర్వహిస్తున్న పుష్కరాల్లో ఓ కార్మికుడు చనిపోతే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని లేకపోతే ధర్మసమాజ్ పార్టీ పక్షాన ఆందోళనలు చేస్తామని శ్రీనివాస్ హెచ్చరించారు.

డీపీఓ పరామర్శ

పుష్కరాల్లో విధులు నిర్వర్తిస్తూ వడదెబ్బకు గురై మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు శ్రీనివాస్ కుటుంబాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి వీరభద్రయ్య పరామర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గంగారంలోని శ్రీనివాస్ ఇంటికి వెళ్లిన డీపీఓ కుటుంబ సభ్యుల ఓదార్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని డీపీఓ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా నాయకుడు మెండ మల్లికార్జునరావు, చిట్యాల శశికుమార్, పప్పుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు



చిట్యాల: మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాస్‌రెడ్డి

రేగొండ : నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి వాసుదేవారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని విత్తన, ఎరువుల డీలర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి పొందిన కంపెనీల విత్తనాలనే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని తెలిపారు. డీలర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వివరాలు రోజువారిగా నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్టు కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మాళవిక, ప్రవీణ్, గోవర్ధన్, డీలర్లు పాల్గొన్నారు,

నిబంధనలు పాటించాలి: ఏఓ కల్యాణి

టేకుమట్ల : విత్తన డీలర్లు, ఫర్టిలైజర్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించొద్దని ఏఓ కల్యాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన డీలర్లు, ఫర్టిలైజర్ యజమానులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ షాపు యజమాని లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు. అలాగే విత్తనాలను తప్పని సరిగా ఎంఆర్‌పీకే విక్రయించాలని, ధరల పట్టికను రైతులకు కనిపించేలా షాపు ఎదుట ప్రదర్శించాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని, అధిక ధరకు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ రోజు షాపు నిర్వాహకులు క్రయ విక్రయాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాహుల్, అరుణ్, యోగిత, భరత్, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

డీలర్లు లైసెన్స్ కలిగి ఉండాలి

చిట్యాల : ఎరువులు, పురుగు మందులు విక్రయించే ప్రతీ డీలరు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా మంగళవారం మండల కేంద్రలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పురుగు మందుల షాపుల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా పురుగుల మందులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రమణ, వివిధ గ్రామాలకు చెందిన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల ఏర్పాటు



భక్తులను తరలిస్తున్న ఎలక్ట్రిక్ వాహనం

కాళేశ్వరం/కాటారం : సరస్వతి పుష్కరాల్లో భాగంగా టూరిజం శాఖ ఆధ్వర్యంలో భక్తులను ఉచితంగా తరలించేందుకు నాలుగు ఎలక్ట్రిక్ వాహనాలను ఏర్పాటు చేశారు. మంగళవారం సరస్వతి ఘాట్ సమీపంలోని టెంట్ సిటీ వద్ద నాలుగు వాహనాలను సిద్ధం చేశారు. భక్తులను హరిత హోటల్ నుంచి వివిధ ప్రాంతాలకు, ఘాటు నుంచి బస్టాండ్ వద్దకు, ఆలయానికి తరలించడానికి ఉచిత సర్వీస్‌ను ఏర్పాటు చేశారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు వినియోగించుకోవాలని హరిత హోటల్ మేనేజర్ జక్కం సురేష్ తెలిపారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీ



తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్

కాటారం : కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల నేపథ్యంలో ఎలాంటి అసాంఘిక సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటున్నారు. ప్రముఖులు, వీఐపీలు, భక్తులు పుష్కర స్నానం ఆచరించడానికి అధిక సంఖ్యలో వస్తున్నందున నిత్యం భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సరస్వతి (వీఐపీ) ఘాట్ వద్ద ప్రత్యేక బృందం పోలీసులు డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. ఘాట్ పరిసరాలు, పుష్కర స్నానానికి వెళ్లే మార్గంలో సుమారు రెండు గంటల పాటు తనిఖీలు కొనసాగించారు.

వాహనాలకు కోసం నిరీక్షణ



షాపు వద్ద కూర్చున్న భక్తులు

మల్హర్ : సరస్వతి పుష్కరాల నేపథ్యంలో భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో దర్శనాలు చేసుకుంటున్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో తాత్కాలిక బస్టాండ్‌కు వెళ్లేందుకు భక్తులు ఎండ వేడిమిని తట్టుకోలేక ఆలయ సమీపంలో షాపుల వద్ద కూర్చొని నిరీక్షిస్తున్నారు.

పేరుకే మీడియా సెంటర్..



మీడియా సెంటర్‌లో సేదదీరుతున్న దేవాదాయ శాఖ అధికారి కుటుంబ సభ్యులు

కాటారం : సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలోని ఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ కేవలం పేరుకే పరిమితమైంది. పుష్కరాల కవరేజ్‌కు మీడియాకు మొదటగా శ్రీ రాజరాజేశ్వర దేవస్థానానికి సంబంధించిన హాల్‌లో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు బ్యానర్ ఏర్పాటు చేశారు. ఆ గదిలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు మీడియా ప్రతినిధులు కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకపోవడంతో అక్కడకు ఎవరూ వెళ్లలేదు. మీడియాకు ప్రాధాన్యత కల్పించకపోవడంతో పలు జర్నలిస్టు సంఘాలు అసహనం వ్యక్తం చేసి కలెక్టర్ రాహుల్‌శర్మ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కలెక్టర్ మీడియా సెంటర్‌ను ఈఓ కార్యాలయంలోని సమావేశ మందిరానికి మార్చి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయితే మీడియా సెంటర్ అని పేరుకే తప్ప దేవాదాయ, ధర్మదాయ శాఖకు సంబంధించిన పలువురు అధికారులు, ఇతర శాఖలకు చెందిన అధికారులు తమ బంధువులు, స్నేహితులను అక్కడకు తీసుకొచ్చి గంటల కొద్ది కూర్చోబెడుతున్నారు. వారు అక్కడే భోజనాలు చేస్తు సేదదీరుతున్నారు. దీంతో జర్నలిస్టులు మీడియా సెంటర్‌కు వెళ్లి తమ పనులు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. సెంటర్‌లో అడుగు పెట్టడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ స్పందించి మీడియా సెంటర్‌లోకి ఇతరులు రాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు జర్నలిస్టులు కోరుతున్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీఓ

మల్హర్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డీసీఓ వాల్యానాయక్ నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని తాడిచర్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం డీసీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోళ్లలో వేగం పెంచాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు తెలిపారు. లారీల కొరత కారణంగా సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి ఇబ్బందులు పడుతున్నామని నిర్వాహకులు డీఎం రాములు దృష్టికి తీసుకెళ్లారు. లారీల సమస్య పరిష్కరిస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన అందించాలి



కాటారం: మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీదేవి



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న ఎంఈఓ కుమారస్వామి



చిట్యాల: మాట్లాడుతున్న ఎంఈఓ రఘుపతి



టేకుమట్ల : మాట్లాడుతున్న ఎంఈఓ సుధాకర్

ఉకాటారం : కాలానికి అనుగుణంగా బోధనలో మార్పులు చేసుకుంటూ నాణ్యమైన విద్యను అందించడానికి ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి శ్రీదేవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉపాధ్యాయుల ఎఫ్ఎల్ఎన్ ప్రాథమిక స్థాయి శిక్షణ తరగతులను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఎంఈఓ ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు సబ్జెక్ట్‌లకు సంబంధించిన ఎమ్మార్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృత్యంతర శిక్షణను వినియోగించుకోవాలి

మొగుళ్లపల్లి : పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల వృత్యంతర శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి, కోర్సు డైరెక్టర్ లింగాల కుమారస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని జెడ్పీఎస్ఎస్ మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రాథమిక ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిక్షణలో సమర్థవంతంగా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలు చేయుటకు, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు కావలసిన వ్యూహాలను నేర్చుకుంటారన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. శిక్షణ అనంతరం తరగదిలో అమలుచేసి విద్యార్థుల్లో సమగ్రాభివృద్ధికి, ఆశించిన సామర్థ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు పెరిగేలా అందరూ కృషి చేయాలన్నారు. శిక్షణకు 52 మంది ఉపాధ్యాయులు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ వంతడుపుల రఘు, మండల రిసోర్స్ పర్సన్లు రవీందర్, వేణుమాధవ్, నాగరాజు, స్వామి, రాము, రాజ్ కుమార్, చంద్రయ్య, రామకృష్ణ, ఎమ్మార్సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పాటుపడాలి

చిట్యాల : పిల్లల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు పాటుపడాలని మండల విద్యాధికారి కొడెపాక రఘుపతి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, సదానందం, నాగరాజు, చక్రపాణి, మహేందర్, తిరుపతయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలను సాధించాలి

టేకుమట్ల : ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న విద్యాసామర్థ్యాలు తరగతి గదిలో సాధించాలని మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్-కెపాసిటీ బిల్డింగ్ ఫర్ ప్రైమరీ స్కూల్ టీచర్స్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో ప్రతీ ఉపాధ్యాయుడు బోధన మెళకువలను విద్యార్థుల్లో అభ్యసనంపై ఆసక్తిని కలిగిస్తూ మెరుగైన ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. డీఆర్‌పీ గణేష్, ఎంఆర్‌పీలు కుడికాల శ్రీనివాస్, గంపల స్వామి, వేణుగోపాల్, రమేష్, సుమన్, మొయిన్, ప్రవీన్, శరత్‌చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మల్హర్ : మండలంలోని తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్కో భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తాడిచర్ల పాత గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో మెడికవర్ ఆస్పత్రి హెడ్ గుర్రం కిరణ్, వైద్యులు దీక్షిత్ అవసరమైన వారికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. గ్రామప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు.